క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

సంగారెడ్డి : ప్రతీఒక్కరూ పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. సంగారెడ్డి పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ డ్రైడేలో భాగంగా గురువారం పట్టణంలోని 4వ, వార్డు శివాజీనగర్‌లో ప్రత్యేక కళాకారుల బృందంతో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తాగి పారేసిన కొబ్బరిబోండాలు, పాత టైర్లు వంటివి ఉంటే చెత్త బండిలో పడేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారుల బృందం, ఆశా వర్కర్స్, అంగన్‌వాడీ టీచర్స్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శన

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామ సేవా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యార్థులు ఆహార పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పంటలను ప్రదర్శించారు. గ్రామ చిత్రపటాన్ని, రంగోలీ కార్యక్రమం నిర్వహించారు. సమస్యల చెట్టు, సీజనల్ విశ్లేషణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్ రాంచంద్రారెడ్డి, ఏఓలు చైతన్య, ప్రవీణ, రైతులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పటాన్‌చెరు టౌన్: ప్రాణాలను కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని స్వచ్ఛంద సేవకులు ఖాదర్ మోహినొద్దీన్ అన్నారు. మండలంలోని ఇస్నాపూర్‌లో గురువారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సీపీఆర్‌పై గృహిణి, విద్యార్థులు ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ సారిక

రాయికోడ్(అందోల్): ఫర్టిలైజర్ డీలర్లు నిర్వహణలో నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సారిక సూచించారు. రాయికోడ్‌లోని రైతువేదికలో మండల ఫర్టిలైజర్ డీలర్లు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల్లో విధిగా స్టాక్‌బోర్డులు, ఎంఆర్‌పీ ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. లైసెన్స్‌లను సకాలంలో రెన్యువల్ చేయించుకోవాలని, ఎరువులు, క్రిమిసంహారకాలను కొనుగోలుచేసే రైతులకు బిల్లులు అందించాలని చెప్పారు.

మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): లోక కల్యాణార్థం ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. గురువారం ఆశ్రమ పీఠాధిపతులు డాక్టర్ సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దత్తాత్రేయ హోమం, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

జహీరాబాద్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ ఎస్.శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పాఠాలు చదివించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందే



పటాన్‌చెరు: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు



జోగిపేటలో ..



నారాయణఖేడ్‌లో..

రుణమాఫీ రైతులందరికీ చేయాలని నిరసిస్తూ గురువారం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని నేతలు అన్నారు. కాంగ్రెస్ పాలనలో 9 నెలలు గడిచిపోయాయని ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



హత్నూరలో..

శిథిలావస్థలో తహసీల్దార్ భవనం

- పెచ్చులూడుతున్న శ్లాబు.. గోడలకు నెర్రెలు
- భయం గుప్పిట్లో రెవెన్యూ సిబ్బంది

హత్నూర(సంగారెడ్డి): దశాబ్దాల క్రితం తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించారు నేడు ఇది శిథిలావస్థకు చేరింది. శ్లాబు నుంచి పెచ్చులూడుతున్నాయి. గోడలు నెర్రెలు బారాయి. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ సమయంలో పెచ్చులూడుతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తుంటారు. వారు కూడా ఇక్కడి పరిస్థితిని చూసి జంకుతున్నారు. ఉన్న సమస్యలతో సతమతమవుతుంటే లేనిపోని కొత్త సమస్యలెందుకని చర్చించుకుంటున్నట్లుగా తెలిసింది. అత్యవసరమైన వారు మాత్రం పని పూర్తయ్యే వరకు కార్యాలయానికి వస్తున్నట్లు తెలిపారు. ఇక కార్యాలయం భవనం గోడల మధ్యలో పిచ్చిమొక్కలు మొలచి గోడలు పూర్తిగా పాడయ్యాయి. ఇటీవల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సైతం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. భవనానికి నెర్రెలు బారి, పగుళ్లు కనిపించడంతో చూసి అవాక్కయ్యారు. వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు కూడా స్పందించి నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలవస్థకు చేరిన విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు ప్రభుత్వం నిధులు నుంచి మంజూరు చేయిస్తే నూతన భవన నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకుంటాం. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది విధులు నిర్వహించేందుకు భయపడుతున్నారు.

– పర్వీన్, షేక్ తహసీల్దార్



భవనం గోడలో మొలిచిన పిచ్చి చెట్లు

ఆక్సిజన్ పార్క్‌కు శివురావు పేరుపెట్టాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎంఐఎం నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ ఆక్సిజన్ పార్కుకు శివురావు షెట్కార్ ఆక్సిజన్ పార్కుగా పేరు పెట్టాలని ఖేడ్ పట్టణ ఏఐఎఐఎం అధ్యక్షుడు మొహిద్ పటేల్ కోరారు. గురువారం పార్టీ నాయకులు మజహర్, అంజద్, జబ్బార్, చాంద్‌పాషా, మోయిస్‌తో కలిసి ఆయన.. ఆర్డీఓ అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఆయన జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఎంపీ, కలెక్టర్‌ను కలిసిన గ్రామస్తులు

పటాన్‌చెరు: జిన్నారం మండలంలోని శివనగర్‌లో 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 13 ఎకరాల స్థలాన్ని తోళ్ల కార్ఖానాకు సంబంధించి ఒక్కొక్కరికి 300 గజాల చొప్పున స్థలం కేటాయించిందని, కాగా ఆ స్థలాల్లో రెండు మూడు కార్ఖానాలు మాత్రమే ఏర్పాటు చేశారని గ్రామస్తులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. మిగిలిన స్థలంలో ఎల్ఈడీ పార్క్ పక్కన గృహ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామస్తులకు ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మత్తుపదార్థాల క్రయవిక్రయాలు నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిని అమ్మడం, కొనడం నేరమని సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ తెలిపారు. గురువారం సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. మత్తు పదార్థాలు కొనడం, అమ్మడం, వినియోగించడం ఏదైనా నేరమేనని ఆల్ప్రెండజోల్ ,హెరాయిన్, గంజాయిలతోపాటు ధూమ, మద్యపానాలు కూడా యువతరం జీవితాన్ని అంధకారంలో పడవేస్తాయన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆలోచనాశక్తి నశించి విచక్షణ కోల్పోయి యువత చెడు అలవాట్లకు లోనవుతున్నారన్నారు. అలాగే కళాశాలలో ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారని తెలిపారు. అనంతరం ప్రజలలో మత్తుపదార్థాలపై అవగాహన కల్పించేందుకు కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైస్ ప్రిన్సిపాల్ డా.సిద్దులు, అధ్యాపక బృందం మురళీకృష్ణ, శరవయ్య, తారా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకులు రమేశ్ బాబు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో రాష్ట్రాల లెర్నింగ్ ప్రొఫెసర్లు



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఇతర రాష్ట్రాల లెర్నింగ్ ప్రొఫెసర్‌లు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని చెర్ల గోపులారం అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఇతర రాష్ట్రాల లెర్నింగ్ ప్రొఫెసర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలో అందిస్తున్న సేవలు, ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య గురించి అంగన్‌వాడీ టీచర్ అనసూయను అడిగి తెలుసుకున్నారు. 3 నుంచి 6 సంవత్సరాల వయసు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు వివిధ రకాల అభ్యసన మూలాల అభివృద్ధికి తగిన అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. పిల్లల పోర్ట్‌ఫోలియో, అబ్జర్వేషన్ నోట్స్ రాసుకోవడం ద్వారా పిల్లల అభివృద్ధిని అంచనా వేయడం జరుగుతుందన్నారు. తద్వారా మరింత డెవలప్‌మెంట్ చెందేందుకు తగినన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం పిల్లలు చెప్పిన కథలు, పాడిన పాటలు విని సంతోషం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సంప్రదింపులు తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, వీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రూ.3.48 లక్షల రికవరికీ ఆదేశం

- కంగ్టిలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక



వివరాలు తెలుసుకొంటున్న అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు, నాగేశ్వర్‌రావు

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పనుల్లో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజు రూ. 3,48,470 మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీలకు రికవరీ చేయాలని ఉపాధి అడిషనల్ డీఆర్‌డీఏ బాలరాజు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొసిజర్‌లో నిర్లక్ష్యం చేసిన సిబ్బంది సరిచేసుకోవాలని సూచనలు చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో రూ. 5,59,33, 394లు వేతనాల రూపంలో రూ.16,31,722లు మెటీరియల్ వ్యయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, ఏపీడీ రాజు, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సాయిసుభాష్, ఎస్ఆర్పీ బద్రు, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ సుభాష్, ఏపీఓ నర్సింహులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నాయకులు

నారాయణఖేడ్: విద్యారంగానికి సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని గురువారం ఖేడ్‌లో సంఘం డివిజన్ నాయకులతో కలిసి ఆయన.. ఆర్డీఓ అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వసతి గృహాలు, గురుకులాలకు పక్కాభవనాలు నిర్మించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

సంగారెడ్డి జోన్ : సంగారెడ్డిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుకునే విద్యార్థులకు వసతి గృహాల కోసం అద్దెకు ఇచ్చే భవన యజమానుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుధామాధురి గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన భవనాల యజమానులు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

◆ **తొమ్మిదికి చేరిన గేదెల మృతి**

పటాచెరు టౌన్: గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని కిష్టయ్యపల్లిలో రెండు రోజుల క్రితం మేతకు వెళ్లిన గేదెలు వర్షం నీటిలో కలిసిన రసాయన వ్యర్థాలు తాగి ఐదు గేదెలు మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే అస్వస్థతకు గురైన మరో 4 గేదెలు గురువారం మృతి చెందాయి.

◆ **యూత్‌కు రాహుల్ గాంధీ స్ఫూర్తి**

రాయికోడ్(అందోల్): యూత్ కాంగ్రెస్‌కు రాహుల్ గాంధీ స్ఫూర్తి అని కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల అధ్యక్షులు జి.అంజయ్య, బి.నర్సింహులు అన్నారు. గురువారం రాయికోడ్‌లో యూత్ కాంగ్రెస్ ఓటరు సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ బలోపేతానికి యువతే కీలకమన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా విదర్భన్‌రెడ్డిని ఎన్నుకోవాలని కోరారు. 18 నుంచి 35 ఏళ్ల వయసున్న యువత ఐవైసీలో నమోదు చేసుకోవాలన్నారు. ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ మహంకాళి, నాయకులు మచ్చేందర్, రఫి, శ్రీనివాస్, విఠల్, మోహన్ పాల్గొన్నారు.

◆ **పేదలకు వరం సీఎంఆర్ఎఫ్**

రాయికోడ్(అందోల్): పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఓ వరం లాంటిదని కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు జి.అంజయ్య, బి.నర్సింహులు అన్నారు. రాయికోడ్‌లో గురువారం 49మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.15,97,500ల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి దామోదర సహకారంతో సకాలంలో సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. మాజీసర్పంచ్ కేదారినాథ్ పాటిల్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ **చెక్కుల పంపిణీ**

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో 26న సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సతీశ్‌కుమార్ గురువారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

◆ **పాదయాత్ర**

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయానికి మహారాష్ట్ర భక్తులు పాదయాత్రగా వచ్చారు. మహారాష్ట్రలోని దరియాపూర్‌లోని అమరావతి సీనియర్ సివిల్ జడ్జి ఓం శంకర్ పాటిల్ పాదయాత్రగా వచ్చారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే మొక్కులు చెల్లించుకున్నారు.

◆ **వైద్య శిబిరం**

పటాన్‌చెరుటౌన్: టీజీఎస్పీఎఫ్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు అమీన్‌పూర్ పరిధిలోని టీజీఎస్పీఎఫ్ శిక్షణ అకాడమీలో సిబ్బందికి ఈఎన్‌టీ, రెటీనా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

◆ **31న క్రీడా జట్ల ఎంపిక**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ 2024కు మెదక్ జట్లను ఈనెల 31 తేదీన ఎంపిక చేస్తామని జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులు గురువారం తెలిపారు. మరింత సమాచారం కోసం ఇన్‌చార్జి దినేష్‌ను సంప్రదించాలని కోరారు. స్కేటర్లలందరూ ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

◆ **పోస్టర్ ఆవిష్కరణ**

పటాన్‌చెరు టౌన్: వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విశ్వశాంతి కోసం పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు నిర్వహించే మహా పాదయాత్ర పోస్టర్‌ను గురువారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముత్తంగి రింగ్ రోడ్డు సమీపంలో ఆవిష్కరించారు. వీరశైవ పాదయాత్ర కమిటీ అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ .. ఈనెల 25 తేదీన ఉదయం 8 గంటలకు పట్టణంలోని జేపీ కాలనీలోని ఉమామహేశ్వర దేవాలయం నుంచి 17వ మహా పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అలాగే కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సైతం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

◆ **అందరూ సమానమే**

సంగారెడ్డి ఎడ్యూకేషన్: మారిన పరిస్థితులకు అనుకూలంగా సమాజంలో అన్ని మార్పులు వస్తున్నాయని, స్త్రీలు, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. అవకాశాల ముందు అందరూ సమానమేనన్నారు. స్థానిక తారా ప్రభుత్వ కళాశాల(అటానమస్), సదాశివపేట డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జెండర్ సెన్సిటైజేషన్, మనోవికాస అభివృద్ధిపై రూబిరో స్వచ్ఛంద సంస్థ సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ **పరిసరాల పరిశుభ్రత ముఖ్యం**

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామంలో ప్రతీ రూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సుధాకర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కుప్పానగర్‌లో పర్యటించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని పారబోసి తిరిగి నింపుకోవాలని పేర్కొన్నారు.

◆ **ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ**

జోగిపేట (అందోల్): జిల్లా పరిషత్ సీఈఓ జానకీ రెడ్డి గురువారం అందోల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని ప్రజాపాలన, పరిపాలన విభాగానికి సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. ప్రజా పాలనలో దరఖాస్తుల సవరణ సరిగా జరుగుతుందా లేదా ? అడిగి తగు సూచనలను చేశారు. అనంతరం సంగుపేట క్రీడా ప్రాంగణ ప్రాంతంలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

◆ **జరిమానా**

సంగారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 9 మందికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. నలుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానాను జడ్జి విధించారు. ఐదుగురికి రెండురోజులపాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

◆ **మొక్కలు నాటడం మనందరి బాధ్యత**

కొండాపూర్(సంగారెడ్డి): మొక్కలు నాటడం మనందరి బాధ్యతని, అందులో భాగంగా ప్రతీ ఒక్కరూ తన తల్లి పేరు మీద ఒక మొక్క అయినా నాటాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రత్నవాణి సూచించారు. గురువారం అమ్మకు వందనంలో భాగంగా మల్లెపల్లిలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మొక్కలు నాటారు.

◆ **రక్తదాన శిబిరం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కోనాపూర్‌లో సంఘ సేవకులు శివకుమార్ గౌడ్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివకుమార్ పాటిల్ ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. నాయకులు అనిల్ రెడ్డి, వెంకటేశం, శేఖర్ గౌడ్, కుమ్మరి కృష్ణ, అంజయ్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

నారాయణఖేడ్: ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ సువర్ణ షెట్కార్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకొని జీఎం ఫౌండేషన్ చైర్మన్, ప్రవాస భారతీయుడు గుర్రపు మశ్చందర్ గురువారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

◆ **పేకాట స్థావరంపై పోలీసుల దాడులు**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని లక్కదొడ్డి కాలనీలో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో వడ్డే రాజు, గోపాల్, వడ్డె చంద్రకాంత్, శంకర్ రెడ్డి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8 వేలు, 4 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

◆ **వ్యక్తి అదృశ్యం**

పటాన్ చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ ఆలీ కథనం ప్రకారం... పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌కు చెందిన పరమేశ్వరరావు(62) ఈనెల 21న బ్యాంకులో నగదు డిపాజిట్ చేసేందుకు ఎస్‌బీఐ ఆర్సీపురానికి వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. తండ్రి అదృశంపై కుమారుడు నానిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

◆ **అమ్మపేరిట ఓ మొక్క నాటుదాం**

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రమైన వట్‌పల్లి పంచాయతీ అవరణలో గురువారం 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ శశిప్రభ మొక్క లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు.

◆ **వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన**



మునిపల్లి(అందోల్): ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని కల్లపల్లి బేల్లూర్ గ్రామంలో గురువారం ఎల్లమ్మ తల్లి, శివుడు, పోచమ్మ, నాంచారమ్మ, నాగబంధం, నందీశ్వరుడు, ధ్వజస్తంభంతోపాటు ఇతర దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపించారు. మాజీ ఎంపీటీసీ శివచంద్రకుమార్ పాటిల్, మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, అంతారం మాజీ సర్పంచ్ శంకర్, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం గౌసాబాద్‌లో నూతనంగా నిర్మించిన శ్రీనాగ ఎల్లమ్మ దేవత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం రాత్రి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు.